

జోష్ కోసం



మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన రజతోత్సవ సభ సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ (ఫైల్)

- పార్లమెంట్ ఎన్నికల తర్వాత వరంగల్‌లో బీఆర్ఎస్ తొలి బహిరంగ సభ
- ఉమ్మడి జిల్లా నుంచి అధిక సంఖ్యలో జనం తరలింపునకు ఏర్పాట్లు
- కార్యకర్తల్లో ఉత్సాహం.. భవిష్యత్‌లో సత్తా చాటడమే ధ్యేయం
- ఉద్యమ ప్రస్థానం, పాలనా విజయాల మేళవింపుతో పునరేకీకరణ

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పార్లమెంట్ ఎన్నికల తర్వాత ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ.. నేడు వరంగల్‌లో భారీ సభ నిర్వహించబోతోంది. ఆ వేదికగా మళ్లీ పుంజుకుని, భవిష్యత్‌లో సత్తా చాటేందుకు ప్రణాళికలు చేసుకుంటోంది. ఈ సభకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి భారీగా జన సమీకరణ చేస్తున్నారు. కార్యకర్తల్లో ఉత్సాహం నింపడంతోపాటు స్థానిక సంస్థల్లో గతంలో ఉన్న మెజారిటీని కాపాడుకోవడం కోసం ప్రత్యేక కార్యాచరణ చేపడుతోంది. ఈ రజతోత్సవ సభకు దాదాపు రెండు నెలల నుంచి పార్టీ మాజీ ఎమ్మెల్యేలు జన సమీకరణ కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. స్వరాష్ట్రం ఏర్పడిన తర్వాత రెండు టర్మ్‌లు బీఆర్ఎస్ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి చెంది, ప్రతిపక్ష పార్టీగా కొనసాగుతోంది. అయితే అసెంబ్లీ ఎన్నికల తర్వాత పార్లమెంట్ ఎన్నికలు వచ్చినప్పటికీ.. పార్టీ ఒక్క సీటును కూడా గెలుచుకోలేక పోయింది. ఈ క్రమంలో కేడర్‌లో కొంత నిరుత్సాహం వచ్చింది. స్థానిక సంస్థల ఎన్నికలు వాయిదా పడుతుండటం, అధికార పార్టీ ఎన్నికలకు ఎప్పుడు వెళ్తుందో తెలియకపోవడం వంటి కారణాలతో కూడా బీఆర్ఎస్ కేడర్ కొంత ఇబ్బందులకు గురవుతోంది. ఎన్నికలు నిర్వహిస్తే సత్తా చాటుదామని భావిస్తున్నా.. వాయిదాల వల్ల క్షేత్రస్థాయిలో ఎలాంటి పనులు చేపట్టలేకపోతున్నామనే భావన

(మిగతా 6లో..)

కేసీఆర్ పాలన కోసం ఆరాటపడుతున్నారు



కాంగ్రెస్ 18 నెలల పాలనపై ప్రజలు తీవ్ర అసంతృప్తి, ఆగ్రహంతో ఉన్నారు. కాంగ్రెస్ తిరోగమన చర్యల వల్ల అభివృద్ధిలో రాష్ట్రం వెనుకబడింది. తెలంగాణలో కేసీఆర్ ప్రస్థానం చారిత్రాత్మక ఘట్టం. 25 ఏళ్లుగా స్వరాష్ట్ర ఏర్పాటు కోసం కృషి చేయడంతోపాటు రెండుసార్లు అధికారంలో ఉండి, రాష్ట్రాన్ని ఒక మోడల్ అభివృద్ధి చేశారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రజా వ్యతిరేక నిర్ణయాలతో ఇబ్బందులకు గురి చేస్తోంది. ఇప్పటికే రాష్ట్రంలో మళ్లీ కేసీఆర్ పాలన కావాలని ప్రజలు ఆరాటపడుతున్నారు. ప్రజలకు, కార్యకర్తలకు దిశానిర్దేశం ఈ సభలో కేసీఆర్ చేయబోతున్నారు. రాష్ట్రాభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యమని ప్రజలు నమ్ముతున్నారు.

- సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, మాజీ మంత్రి

కాంగ్రెస్‌పై దండయాత్రకు సిద్ధం

కాంగ్రెస్‌పై ప్రజలు దండయాత్రకు సిద్ధమవుతున్నారు. అందుకే స్వచ్ఛందంగా వరంగల్ సభకు తరలిరానున్నారు. 2023కు ముందు పాలన.. ప్రస్తుత కాంగ్రెస్ పాలనను ప్రజలు అంచనా వేసుకుంటున్నారు. జిల్లాలోని పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయలేదు. కేసీఆర్ హయాంలో పూర్తి చేసిన ప్రాజెక్టుల ద్వారా నీళ్లు ఇవ్వడానికి చేతకావడం లేదు. దీంతో ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉంది. రాష్ట్రంలో కేసీఆర్ ఆధ్వర్యంలో పాలనను ప్రజలు కోరుకుంటున్నారు. బీఆర్ఎస్ చేపట్టిన పథకాలను అమలు చేయడం లేదు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదు. ఈ రజతోత్సవ సభ వేదికగా ప్రజలు తిరుగుబాటు చేసి, కాంగ్రెస్‌ను నామరూపాల్లేకుండా చేస్తారు.

- వి.శ్రీనివాస్‌గౌడ్, మాజీ మంత్రి



నీళ్లు కావాలని కానిస్టేబుల్‌ను అడుగుతున్న వృద్ధురాలు



వృద్ధురాలికి బాటిల్‌లో నీళ్లు తెచ్చి ఇచ్చిన కానిస్టేబుల్

చల్లగా ఉండయ్యా..



నీళ్లు తాగుతున్న వృద్ధురాలు

అది నారాయణపేట జిల్లా కేంద్రంలోని సత్యనారాయణ చౌరస్తా.. శనివారం మిట్ట మధ్యాహ్నం వేళ.. ఎండ దంచి కొడుతోంది.. అక్కడికి వచ్చిన ఓ వృద్ధురాలు దాహంతో అల్లాడుతోంది.. ఎవరిని అడగాలో అర్థం కాక చుట్టూ చూసింది.. అక్కడే ఓ ట్రాఫిక్ కానిస్టేబుల్ కనిపించాడు.. అతన్ని చూడగానే ఆమెకు ప్రాణం లేచివచ్చినట్లయ్యింది.. అయ్యా అంటూ అతన్ని పిలిచింది.. దగ్గరగా వచ్చిన కానిస్టేబుల్‌తో దీనంగా దూపయితుంది, గుక్కెడు మంచి నీళ్లు కావాలయ్య అని అడిగింది.. వెంటనే కానిస్టేబుల్ దగ్గరలో ఉన్న చలివేంద్రం వద్దకు వెళ్లి, ఓ బాటిల్‌లో నీళ్లు తెచ్చి ఆమెకు ఇచ్చాడు.. దాహంతో గొంతు ఎండుకుపోయిన ఆ వృద్ధురాలు గబగబా నీళ్లు తాగింది.. తర్వాత కానిస్టేబుల్ వైపు కృతజ్ఞతగా చూస్తూ, చల్లగా ఉండయ్యా అని దీవించింది.. ఆ మాటలకు కానిస్టేబుల్ నవ్వుకుంటూ వెళ్లిపోయాడు.. ఈ దృశ్యాన్ని చూసిన పలువురు కానిస్టేబుల్ మానవత్వానికి మనసులోనే సెల్యూట్ చేశారు..

- నారాయణపేట, ఆంధ్రజ్యోతి

పార్థీ గ్యాంగ్‌లో కీలక వ్యక్తి అరెస్టు

- 25.9 తులాల బంగారం రికవరీ
- వెల్లడించిన పాలమూరు ఎస్పీ జానకీ

7

దుందుభీని.. దున్నేస్తున్నారు

- నది నుంచి రాత్రి వేళ ఇసుక అక్రమ తరలింపు
- డంపింగ్ చేసి, ఉదయం ఇతర ప్రాంతాలకు చేరవేత
- జోరుగా ఫిల్టర్ ఇసుక దందా.. పట్టని అధికారులు
- మాఫియాకు పలువురు రాజకీయ నాయకులు, ఆఫీసర్ల సహకారం?



మిడ్జిల్ మండలం కొత్తపల్లి వాగులోంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లు (ఫైల్)

జడ్చర్ల, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): దుందుభీ నదిని ఇసుక మాఫియా దున్నేస్తోంది. రాత్రిపూట నది నుంచి ఇసుకను తరలించి, సమీప ప్రాంతాల్లో డంపింగ్ చేస్తోంది. తర్వాత ఉదయం వేళల్లో దర్జాగా తరలిస్తోంది. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. రోజూ పదుల సంఖ్యలో ట్రాక్టర్‌ల ద్వారా ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్నారు. మిడ్జిల్, మున్ననూరు, కొత్తూరు, కొత్తపల్లి, ఆర్సీ తండా, కుర్వగడ్డపల్లి గ్రామాలకు చెందిన ట్రాక్టర్‌లలో ఇసుకను తరలిస్తున్నారు. ఇసుకను అక్రమంగా తరలించేందుకు కొందరు నాయకులు మాఫియాతో కుమ్మక్కయ్యారు. ప్రభుత్వ పనులకు ఇసుక అవసరమంటూ ప్రతీ శనివారం వాగులోంచి వందలాది ట్రాక్టర్ల ఇసుకను అక్రమంగా తరలించేలా చక్రం తిప్పారు. ఇలా తరలిస్తున్న ప్రతీ ట్రాక్టర్ యజమానితో స్థానిక నాయకుడు వసూళ్లకు పాల్పడి, వచ్చిన



కొత్తపల్లి వాగులో ఇసుక తరలింపుతో ఏర్పడిన గుంతలు

వాటిని తిలా పాపం-తలా పిడికెడు అన్నచందంగా మిగిలిన నాయకులకు పంచుతున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి.

ఇసుక అక్రమ రవాణాకు చెక్ పడేనా?

నియోజకవర్గంలోని మిడ్జిల్ మండలం కొత్తపల్లి, కొత్తూరు, భైరంపల్లి శివారుతో పాటు జడ్చర్ల మండలంలోని కుర్వగడ్డపల్లి, నెక్కొండ, ఈర్లపల్లి, శివారు, ఉదండాపూర్ రిజర్వాయర్ నిర్మాణం ప్రాంతంలో ఫిల్టర్ ఇసుక, రాజాపూర్ మండలంలోని మల్లెపల్లి, నందిగామ, ముదిరెడ్డిపల్లి, కుచ్చర్‌కల్, రాజాపూర్, రాయపల్లి, చెన్నవల్లితో పాటు నవాబ్‌పేట, బాలానగర్ ప్రాంతాల నుంచి ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారు. ఇసుక అక్రమ రవాణాలో రాజకీయ నాయకులతో పాటు అధికారులు మాఫియాకు సహకరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని, ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

స్పందించని అధికారులు

ఇటీవల కొత్తపల్లి శివారులో ఇసుక డంపులను పోలీసులు సీజ్ చేసి, రెవెన్యూ శాఖకు అప్పగించిన సందర్భాలు ఉన్నాయి. రాత్రిపూట ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న అంశంపై కొందరు నిఘా పెట్టారు. అర్ధరాత్రి అనంతరం ఇసుక రవాణా చేస్తున్న విషయంతో పాటు ఆ ప్రాంతం గురించి పోలీసులకు, మైనింగ్‌శాఖ, జిల్లా స్థాయి అధికారులకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చేందుకు ప్రయత్నించగా, అధికారుల నుంచి ఎలాంటి రెస్పాన్స్ రాలేదని కొందరు యువకులు చెప్పారు. దాంతో ఆ విషయాలను సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. మిడ్జిల్, కొత్తూరు మధ్యలో ఉన్న చిన్నవాగుతో పాటు మిడ్జిల్ మండలంలోని కొత్తపల్లి పెద్దవాగు నుంచి ఇసుక మాఫియా ఇసుకను అక్రమంగా తరలిస్తోంది.

సాగు భూములకు పట్టాలు ఇవ్వాలి

- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం

వార్త 7లో..

ఆటకు వేళాయె!

- వచ్చే నెల 1 నుంచి వేసవి క్రీడా శిబిరాలు
- మహబూబ్‌నగర్ జిల్లాలో 30 కేంద్రాలు

7

అన్నదాత ఆగ్రహం

- గన్నీ బ్యాగుల కోసం రోడ్డెక్కిన రైతులు
- నారాయణపేట కొత్త బస్టాండ్ ముందు రాస్తారోకో
- మరికల్, క్యాతన్‌పల్లిలలో ఆందోళన

6



నారాయణపేటలో అంతర్రాష్ట్ర రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు

అన్ని సమస్యలకు భూ భారతితో పరిష్కారం

- అన్నం పెట్టే రైతును రాజును చేయాలన్నదే లక్ష్యం
- జూన్‌లో గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు: యెన్నం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ న్యూటౌన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): భూమికి సంబంధించిన అన్ని సమస్యలకు భూ భారతి చట్టం ద్వారా పరిష్కారం లభిస్తుందని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారం నగర పాలక పరిధిలోని యూబీ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన భూ భారతి అవగాహన సదస్సుకు ఎమ్మెల్యే, కలెక్టర్ విజయేందిర బోయి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అందరికి అన్నం పెట్టే రైతన్నను రాజును చేయలన్నదే ప్రజా ప్రభుత్వ లక్ష్యమన్నారు. భూ భారతి చట్టంతో రికార్డుల్లో ఉన్న చిన్న చిన్న ఇబ్బందులు, పొరపాట్లు ఉన్నా, విస్తీర్ణంలో, పేర్లలో వారసత్వ విషయంలో తప్పులు ఉంటే తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి సరి చేసుకోవాలన్నారు. ధరణి చట్టం ద్వారా రైతులకు నష్టం జరిగిందని గుర్తించి, మళ్లీ రైతులు నష్టపోరాదని 14 నెలల పాటు శ్రమించి భూ భారతి చట్టాన్ని ప్రభుత్వం తెచ్చిందన్నారు. ఈ చట్టం గురించి గ్రామాల్లోని ప్రజలకు వివరించాలని సూచించారు. సన్న వడ్లు పండించాలని రైతులను నాడు కోరగా 69 శాతం మంది పండించారన్నారు. వారికి బోనస్ కింద ప్రతీ రైతుకు రూ.20 వేల నుంచి రూ.40 వేల వరకు అదనంగా వారి ఖాతాలలో డబ్బులు జమ చేయడం జరిగిందని, ఈ సారి 90 శాతం మంది రైతులు సన్నరకం వడ్లను పండిస్తున్నారన్నారు. అదనపు కలెక్టర్లు మోహన్ రావు, శివేంద్ర ప్రతాప్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, మూడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనితరెడ్డి, మునిసిపల్ మాజీ చైర్మన్ ఆనంద్ కుమార్ గౌడ్, షబ్బీర్ అహ్మద్, బుద్దారం సుధాకర్ రెడ్డి, హన్మంతు, రామాంజనేయులు, ఖాజాపాషా, అంజద్, రాషెద్, చిన్న, అధికారులు పాల్గొన్నారు.

భూనీడులో పారిశుధ్య చర్యలు



భూనీడులో మురుగుకాలువలో ఉన్న పిచ్చి మొక్కలను ఎక్స్‌కవేటర్‌తో తొలగిస్తున్న మునిసిపల్ సిబ్బంది

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కొత్తపల్లి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా కొత్తపల్లి మండలంలో 'అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ' శీర్షికన శనివారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన వార్తా కథనానికి మునిసిపల్ అధికారులు స్పందించారు. మండల కేంద్రంతో పాటు, భూనీడు గ్రామంలో మునిసిపల్ సిబ్బంది పారిశుధ్య చర్యలు చేపట్టారు. కాలువల్లో ఉన్న మురుగునీటిని ముందుకు సాగేలా చర్యలు చేపట్టారు. మురుగు తొలగింపుతో భూనీడులో కాలనీవాసులు 'ఆంధ్రజ్యోతి'కి కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్యేను పరామర్శించిన మంత్రి సీతక్క



ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణను పరామర్శించిన రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క

అచ్చంపేట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యం నుంచి కోలుకుంటున్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణను హైదరాబాద్‌లోని తన నివాసంలో శనివారం రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

భక్తిశ్రద్ధలతో శనీశ్వరాలయంలో ప్రత్యేక పూజలు



నందివడ్డెమాన్‌లోని శనీశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

బిజినేపల్లి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): శ్రీ జేష్ఠాదేవి సమేత సార్థసప్త శనీశ్వర స్వామికి భక్తిశ్రద్ధలతో భక్తులు తిల తైల అభిషేకాలతో ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ ప్రధాన పూజారి డాక్టర్ గవ్వమఠం విశ్వనాథశాస్త్రి తెలిపారు. బిజినేపల్లి మండల పరిధిలోని నందివడ్డెమాన్‌లోని నందీశ్వరాలయం ఆవరణలోని శనీశ్వర స్వామికి శనివారం భక్తులు నల్లని వస్త్రాలు ధరించి నువ్వుల నూనె, జిల్లేడు పూలు, నల్లని నువ్వులు, నల్లని వస్త్రంతో పూజలు ఘనంగా చేశారు. శనీశ్వర స్వామిని ఏడు వారాల పాటు పూజించిన అనంతరం ఆలయ ఆవరణలోని నందీశ్వరుడికి, పరమశివునికి వివిధ రకాల పండ్ల రసాలు, బిల్వ పత్రాలతో అభిషేకాలు, రుద్రాభిషేకాలు నిర్వహిస్తే స్వామి వారి కృపకు నోచుకుంటారని ప్రధాన అర్చకులు వివరించారు. వివిధ జిల్లాల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తాగునీటి వసతి, అల్పాహారం ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ గోపాల్‌రావు తెలిపారు. పూజారులు ఉమామహేశ్వర్, శాంతికుమార్, ఆలయ కమిటీ సభ్యులు ప్రభాకరాచారి, వీరశేఖర్, రాజేష్, ప్రభాకర్, పుల్లయ్య, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు

- గద్వాల డీఎస్పీ మొగులయ్య



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ మొగులయ్య

అయిజ టౌన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : మద్యం తాగి వాహనాలు నడపొద్దని గద్వాల డీఎస్పీ మొగులయ్య అన్నారు. కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమంలో భాగంగా శనివారం జోగుళాంబ గద్వాల జిల్లా, అయిజ ఎస్సీ కాలనీలో తనిఖీలు నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రం ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సరైన ధ్రువపత్రాలు లేని 49 ద్విచక్ర వాహనాలు, 3 ఆటోలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ద్విచక్రవాహనాలు నడిపేవారు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ విషయంపై యువత తమ తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని చెప్పారు. ఇటీవలి కాలంలో ఆన్‌లైన్ బెట్టింగ్‌ల దందా చాప కింద నీరులా విస్తరిస్తోందన్నారు. ఈజీ మనీకి అలవాటు పడిన కొందరు వీటిని అమాయక యువతకు పరిచయం చేయి లక్షల రూపాయలు కొల్లగొడుతున్నారని తెలిపారు. ఈ విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తం కావాలని, పిల్లలను గమనిస్తూ ఉండాలని సూచించారు. కార్యక్రమంలో శాంతినగర్ సీఐ టాటాబాబు, అయిజ ఎస్ఐ శ్రీనివాసరావు, వివిధ మండలాల ఎస్ఐలు, పోలీసులు పాల్గొన్నారు.



సరైన ధ్రువపత్రాలు లేని ద్విచక్రవాహనాలు, ఆటోలు.

బొడ్రాయి పునః ప్రతిష్ఠకు రూ. 10 లక్షల విరాళం

అచ్చంపేట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో నూతనంగా నిర్మించ తలపెట్టిన పోచమ్మ తల్లి దేవాలయం, బొడ్రాయి పునః ప్రతిష్ఠా కార్యక్రమాలకు గాను అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ వ్యాపారులు శనివారం మునిసిపల్ చైర్మన్ శ్రీనివాసులుకు 10 లక్షల విరాళం అందజేశారు. మే 1 నుంచి 4 వరకు నిర్వహించే కార్యక్రమాలకు వివిధ కుల సంఘాల నాయకులు విరాళం అందజేశారు. బొడ్రాయి ప్రతిష్ఠా ఉత్సవాలకు భారీగా ఏర్పాట్లను చేస్తున్నారు.

అన్నదాత ఆగ్రహం



పేట సింగిల్ విండో కార్యాలయం



పేట సింగిల్ విండో కార్యాలయ ఆవరణలో బ్యాగులకోసం చెట్ల కింద కూర్చున్న రైతులు

- గన్నీ బ్యాగుల కోసం రోడ్డెక్కిన రైతులు
- పేట కొత్త బస్టాండ్ ముందు రాస్తారోకో
- స్తంభించిన వాహనాల రాకపోకలు
- మరికల్, క్యాతన్‌పల్లిలలో ఆందోళన

నారాయణపేట/ మరికల్/ దామరగిద్ద, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : కొనుగోలు కేంద్రాల్లో గన్నీ బ్యాగుల కొరతపై అన్నదాతలు ఆగ్రహించారు. మూడు రోజులుగా తిరుగుతున్నా గన్నీ బ్యాగులు అందకపోవడంపై మండిపడ్డారు. నారాయణపేట జిల్లా కేంద్రంలోని పట్టణంలోని కొత్త బస్టాండ్ ముందు, అంతర్రాష్ట్ర రహదారిపై శనివారం రాస్తారోకో చేపట్టారు. దీంతో కొద్దిసేపు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న పోలీసులు జోక్యం చేసుకొని రైతులతో మాట్లాడారు. గన్నీబ్యాగుల కొరత ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. రోడ్డెక్కి వాహనాల రాకపోకలకు ఆటంకం సృష్టించడం సరికాదని నచ్చచెప్పారు. రైతులను సింగిల్ విండో కార్యాలయం వద్దకు తీసుకెళ్లి అధికారులతో మాట్లాడించారు. ఇప్పటివరకు 30 వేల గన్నీ బ్యాగులు ఇచ్చామని, మళ్లీ రాగానే రైతులకు అందిస్తామని వారు తెలిపారు.



రైతులతో మాట్లాడుతున్న పోలీసులు

లారీల కోసం ఆందోళన

ధాన్యం తరలింపునకు లారీలు రాకపోవడంతో రైతులు ఆందోళనకు దిగారు. దామరగిద్ద మండలానికి చెందిన వివిధ గ్రామాల నుంచి రైతులు కొనుగోలు కేంద్రాల్లో తూకం చేసిన ధాన్యాన్ని ట్రాక్టర్లలో మండల పరిధిలోని క్యాతన్‌పల్లిలోని మిల్లు వద్దకు తీసుకొచ్చారు. అక్కడి నుంచి ధాన్యాన్ని ఇతర మిల్లులకు తరలించాల్సి ఉంది. కానీ రెండు రోజులుగా లారీలు రాకపోవడంతో ధాన్యాన్ని ట్రాక్టర్లలోనే ఉంచుకోవాల్సి వచ్చింది. దీంతో వారు రోజుకు రూ. 2 వేల చొప్పున ట్రాక్టర్ల అద్దె చెల్లించాల్సి వస్తోంది. దీంతో ఆగ్రహించిన రైతులు శనివారం గ్రామంలోని మద్దూరు - నారాయణపేట ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. సమాచారం అందుకున్న ఏఎస్ఐ అరుణ్ అక్కడికి చేరుకొన్నారు. అధికారులతో ఫోన్లో మాట్లాడారు. వెంటనే లారీలను పంపించనున్నట్లు వారు తెలపడంతో ఆందోళన విరమించారు.

ధన్వాడ 'సింగిల్ విండో' ముందు ధర్నా

గన్నీ బ్యాగులు సరఫరా చేయాలంటూ రైతులు ధన్వాడ మండల కేంద్రంలోని సింగల్ విండో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. శనివారం తెల్లవారుజామునే కార్యాలయానికి వచ్చిన రైతులు గన్నీ బాగుల కోసం సాయంత్రం వరకు ఎదురు చూశారు. కానీ రాకపోవడంతో కార్యాలయం ముందు ధర్నా చేశారు. గన్నీ బాగుల కోసం మూడు రోజులుగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగున్నర లక్షల గన్నీ బాగులు అవసరం ఉండగా, లక్ష మాత్రమే ఇచ్చారని తెలిపారు.



ధన్వాడ సింగిల్ విండో కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న రైతులు

సహాయక చర్యల నిలిపివేత దారుణం

- రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలి
- మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లాలోని, ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో సహాయక చర్యల నిలిపివేత కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యమని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. ఆరుగురు కార్మి కుల మృతదేహాలను బయటకు తీయకుండానే మూడు నెలల పాటు సహాయక చర్యలను నిలిపివేయడం దారుణమన్నారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదం, సహాయక చర్యలపై ప్రభుత్వం ఒక స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చే శారు. అవగాహన, సమీక్ష లేకుండా హడావుడిగా పనులను మొదలు పెట్టి 8 మంది ప్రాణాలను బలిగొన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం ఇద్దరి మృత దేహాలను బయటకు తీసి, 63 రోజుల తరువాత మిగిలిన వారిని వదిలేసి చేతు లెత్తేశారని విమర్శించారు. హెలికాప్టర్‌లో తిరిగి, చేపల కూరలు తిని హంగామా చేసిన మంత్రులు, ముఖ్యమంత్రి ప్రమాదం విషయంలో అధికారికంగా ఎందు కు ప్రకటన చేయడం లేదని ప్రశ్నించారు. మరణించిన కుటుంబాలకు ఎందుకు సమాధానం చెప్పడం లేదని నిలదీశారు. మృతదేహాలను కుటుంబసభ్యులకు అ ప్పగించకుండా, కనీసం వారి చివరి చూపునకు కూడా నోచుకోని దయనీయ పరిస్థితిని కాంగ్రెస్ ప్రభుత్వం కల్పించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

చోరీ కేసు నమోదు

ఊర్కొండ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): చోరీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కృష్ణదేవ తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలం రాచాలపల్లి గ్రామా నికి చెందిన నార్ల వెంకటయ్య వ్యవసాయ భూమిలో ఉన్న బోరు మోటారును శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారన్నారు. బాధిత రైతు శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చి న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ పేర్కొన్నారు.

జోష్ కోసం



వనపర్తిలో పార్టీ దిమ్మెకు రంగులు వేసిన బీఆర్ఎస్ నాయకులు

(5వ పేజీ తరువాయి)

వారిలో నెలకొంది. అలాగే సంవత్సర కాలంగా పార్టీ ఆధ్వర్యంలో పెద్ద సభలు ఏవీ జరగకపోవడం, అధినేత దిశానిర్దేశం కూడా చేయకపోవడం కూడా ఇందుకు మరో కారణంగా చెప్పవచ్చు. ఎట్టకేలకు పార్టీ అధిష్ఠానం రజతోత్సవం పేరుతో భారీ బహిరంగ సభకు ప్లాన్ చేయడం, భవిష్యత్ ప్రణాళికపై సభ ద్వారా స్పష్టత వచ్చే అవకాశం ఉండటంతో కార్యకర్తల్లో జోష్ నెలకొంది.

వైఫల్యాలే ఎజెండాగా..

వాస్తవానికి రజతోత్సవ సభ 25 సంవత్సరాలు నిండిన తర్వాత చేయాల్సి ఉంటుంది. గతంలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను కూడా ఒక సంవత్సరం ముందుగానే నిర్వహించిన మాదిరిగా, బీఆర్ఎస్ తమ రజతోత్సవ సభను ఒక సంవత్సరం ముందుగా నిర్వహించాలని తలపెట్టింది. ఇందుకు ప్రధాన కారణం ఇప్పుడు నిర్వహిస్తేనే స్థానిక సంస్థల ఎన్నికల్లో భారీ లబ్ధి చేకూరడంతోపాటు, అధికార పార్టీ వైఫల్యాలను ఎండగట్టే అవకాశం ఉంటుందని భావిస్తోంది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత నిధుల లేమి సమస్యను తీవ్రంగా ఎదుర్కొంటోంది. ఒకేసారి రుణమాఫీ చేయడం, స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకపోవడంతో కేంద్ర గ్రాంట్లు నిలిచిపోవడం, ఎమ్మెల్యేల ఒంటెత్తు పోకడల కారణంగా కొంత ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయనే భావనను ఆధారంగా చేసుకుని తమకు అనుకూలంగా మార్చుకునే ప్రయత్నం చేస్తోంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కొంత కేడర్ ఆ పార్టీ వైపు మొగ్గినప్పటికీ.. గ్రామాల్లో పార్టీ ఇంకా బలంగానే ఉంది. అయితే నాయకత్వం నుంచి కచ్చితమైన భరోసా లేకపోవడం వంటి కారణాలతో ఇబ్బందులు ఎదుర్కొంటోంది.

భారీగా జన సమీకరణ..

దాదాపు రెండు నెలల నుంచి బీఆర్ఎస్ పార్టీ నాయకత్వం సభ నిర్వహణ కోసం భారీ ఏర్పాట్లు చేసింది. ఉమ్మడి పాలమూరు జిల్లా నుంచి మాజీ ఎమ్మెల్యేలు, ప్రస్తుత ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకుల ఆధ్వర్యంలో సన్నాహక సమావేశాలు ప్రతీ నియోజకవర్గంలోనూ నిర్వహించారు. ఇక్కడి నుంచి ఆర్టీసీ బస్సులను, పాఠశాలల బస్సులను, డీసీఎంలను భారీ సంఖ్యలో ఏర్పాటు చేశారు. కేడర్ ఎవరికి వారే సొంత వాహనాల్లో కూడా వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. ఉమ్మడి జిల్లాలో 2014 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ సగం సీట్లను దక్కించుకుని.. తర్వాత కొందరిని పార్టీలో చేర్చుకుంది. 2018లో మాత్రం మొత్తం 14 స్థానాల్లో 13 స్థానాలు గెలుచుకుని, మిగిలిన ఒక్క ఎమ్మెల్యేను పార్టీలో చేర్చుకున్నారు. అంత బలంగా ఉన్న పార్టీ 2023 ఎన్నికల నాటికి 12 స్థానాలు కోల్పోయి.. కేవలం రెండు స్థానాలను మాత్రమే గెలుచుకుంది. తర్వాత జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలిచి కొంత ఊరటనిచ్చినా.. పార్లమెంట్ ఎన్నికల్లో సిట్టింగ్ రెండు స్థానాలను కోల్పోయింది. తర్వాత అధికార కాంగ్రెస్ అనేక సభలు నిర్వహిస్తూ ప్రభుత్వం చేస్తున్న పనులను ప్రజల్లోకి తీసుకువెళ్లే ప్రయత్నాలు జిల్లా పరిధిలో చేసింది. కానీ బీఆర్ఎస్ మాత్రం రాష్ట్రవ్యాప్తంగా భారీ సభలు నిర్వహించలేదు. ఈ క్రమంలోనే సభ నిర్వహించడం ఆ పార్టీ శ్రేణుల్లో కచ్చితంగా జోష్ నిలిపే అవకాశం ఉంది.

స్టేట్ 2వ ర్యాంకర్ ప్రవళికకు అభినందనలు



విద్యార్థిని ప్రవళికను అభినందిస్తున్న మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ, చిత్రంలో కరస్పాండెంట్ జే మహేందర్

గద్వాల సర్కిల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్ ప్రథమ సంవత్సరం ఫలితాల్లో స్టేట్ 2వ ర్యాంకు సాధించిన విద్యార్థిని ప్రవళికను మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అభినందించారు. జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని శ్రీ వాగ్దేవి జూనియర్ కళాశాల ప్రథమ సంవత్సరం విద్యార్థిని కే ప్రవళిక ఇంటర్ (ఎంపీసీ) ప్రథమ సంవత్సరం పరీక్షల్లో 470 మార్కులకు 467 మార్కులతో రాష్ట్ర స్థాయి 2వ ర్యాంకు, జిల్లా స్థాయి మొదటి ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా శనివారం మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ గద్వాలలోని తన నివాసంలో విద్యార్థినిని ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో అత్యుత్తమ ఫలితాలు సాధించి జిల్లాకు పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ జే మహేందర్, కుటుంబ సభ్యులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

లాక్రోస్ జాతీయ స్థాయి టోర్నీకి జిల్లా క్రీడాకారులు



శ్రీనివాసులు



కృష్ణ



దివాకర్



భాస్కర్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలోని ఆగ్రాలో ఈనెల 28 నుంచి మే 1వ తేదీ వరకు నిర్వహించనున్న లాక్రోస్ 3వ జూనియర్, సీనియర్ నేషనల్ టోర్నీలో పాల్గొనే తెలంగాణ జూనియర్, సీనియర్ జట్లకు జిల్లా క్రీడాకారులు ఎంపికైయ్యారు. రాష్ట్ర జట్టులో క్రీడాకారులు శ్రీనివాసులు, కృష్ణ, దివాకర్, భాస్కర్ చోటు దక్కి, జాతీయస్థాయి టోర్నీకి ఎంపిక కావటం పట్ల జిల్లా లాక్రోస్ అసోసియేషన్ ప్రతినిధి శ్రీనివాస్ అభినందించారు. టోర్నీలో ప్రతిభ చాటి జట్టు విజయానికి కృషి చేయాలని ఆకాక్షించారు.

హత్యకేసులో నలుగురి అరెస్ట్

- వివాహేతర సంబంధమే కారణం..
- విలేకరుల సమావేశంలో డీఎస్పీ మొగులయ్య

గద్వాల క్రైం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా గట్టు మండలం కేటీదొడ్డి శివారులో హనుమప్ప గుట్ట దగ్గర ఈ నెల 19న గుర్తు తెలియని మృతదేహం లభించింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టి నలుగురు నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ మొగులయ్య తెలిపారు. గద్వాల సర్కిల్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. కేటీదొడ్డి మండలంలోని గంగనపల్లికి చెందిన శ్రీదేవి (ఏ-1), అలియాస్ పద్మకు మద్దెలబండకు చెందిన కుర్వ నరసింహులుతో 12 సంవత్సరాల క్రితం వివాహమైంది. వారికి 9 సంవత్సరాల కుమారుడు ఉన్నాడు. భార్యాభర్తల మధ్య తరుచూ గొడవలు జరుగుతూ ఉండేవి. దీంతో శ్రీదేవి గంగనపల్లిలోని తల్లిగారి ఇంటి పక్కన గుడిసె వేసుకొని జీవనం సాగిస్తోంది. అప్పుడప్పుడు ఆమె భర్త వచ్చి వెళ్తుండేవాడు. ఏడాది నుంచి శ్రీదేవికి కుర్వ అంజిలప్ప(ఏ-2) అనే వ్యక్తితో వివాహేతర సంబంధం ఏర్పడింది. తరుచూ గొడవలు అవుతున్నందున తన భర్తను చంపాలని శ్రీదేవి అతడికి చెప్పింది. దీంతో అజిలప్ప బస్వాపురం గ్రామానికి చెందిన గుంత గోవిందు (ఏ-3)కు విషయాన్ని తెలిపాడు. నరసింహను హత్య చేయాలని, రూ. లక్ష ఇస్తానని చెప్పడంతో అతడు అంగీకరించాడు. ఆ తర్వాత నరసింహ గోవిందుతో పరిచయం పెంచుకున్నాడు. పథకం ప్రకారం ఈ నెల 17న సాయంత్రం మైలగడ్డ స్టేజీ వద్ద మద్యం కొనుగోలు చేసి, కేటీదొడ్డి మండల శివారులోని హనుమప్ప గుట్ట దగ్గర తాగారు. ఆ తర్వాత గోవిందు బస్వాపురం గ్రామానికి చెందిన ఆంజనేయులు(ఏ-4) అలియాస్ పెద్ద దుబ్బన్నను పిలిపించుకున్నాడు. రూ. 50వేలు ఇస్తానని చెప్పి హత్య పథకాన్ని వివరించాడు. అనంతరం వారిద్దరూ కలిసి కత్తితో దాడి చేసి నర్సింహులను చంపేశారు. అనంతరం అక్కడే ఉపాధి హామీ పనుల్లో భాగంగా తవ్విన మట్టిలో మృతదేహాన్ని పూడ్చి పెట్టారు. ఆ తర్వాత 19వ తేదీన ఉపాధి పనులు జరుగుతుండగా మృతదేహం బయటపడింది. ఈ విషయాన్ని ఫీల్డ్ అసిస్టెంటు వెంకటేశ్ గౌడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. సీసీ కెమెరా ఫుటేజీల ఆధారంగా నలుగురు నిందితులను గుర్తించి అరెస్టు చేశారు. కేసు ఛేదనలో ప్రతిభ కనబర్చిన పోలీఉ సిబ్బందిని ఎస్పీ అభినందించి రివార్డు అందించారు. విలేకరుల సమావేశంలో సీఐ టంగుటూరి శ్రీను, కేటీ దొడ్డి ఎస్ఐ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఎస్ఐల పేర్లతో ఫేక్‌కాల్స్

- సైబర్ నేరగాళ్ల కొత్త పన్నాగం

దేవరకద్ర/ మూసాపేట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరగాళ్లు ఎస్ఐల పేర్లతో ఫోన్లు చేసి డబ్బు డిమాండ్ చేసిన ఘటనలు వెలుగు చూశాయి. దేవరకద్ర, మూసాపేట మండలాల్లో శనివారం ఈ సంఘటనలు జరిగాయి. గుర్తు తెలియని ఓ వ్యక్తి పలువురికి ఫోన్ చేసి తాను దేవరకద్ర కొత్త ఎస్ఐని అని, తన పేరు శ్రీనివాస్ అని చెప్తున్నారు. డబ్బు ట్రాన్స్‌ఫర్ చేయండి అంటూ ఫోన్ నెంబర్ ఇస్తున్నారు. కొందరు ఈ విషయాన్ని స్థానిక ఎస్ఐ దృష్టికి తీసుకెళ్లారు. అందుకు ఆయన స్పందిస్తూ సైబర్ నేరగాళ్లు చేసే ఇలాంటి మోసపూరితమైన ఫోన్ కాల్స్ చేసి డబ్బు స్వాహా చేస్తారని తెలిపారు. అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే మూసాపేట మండలంలోని జానంపేటకు చెందిన పెట్రోల్ బంకు యాజమాని శివప్రసాద్‌కు ఓ వ్యక్తి ఫోన్ ఎస్ఐ మాట్లాడతారని చెప్పడంతో మేనేజర్ రాజేష్ నెంబర్ ఇచ్చాడు. ఆ నెంబర్‌కు ఓ వ్యక్తి ఫోన్ చేసి తాను అడ్డాకుల ఎస్ఐని అని, ఫోన్‌పే క్యూఆర్ కోడ్ ఇచ్చానని, వెంటనే రూ. 20 వేలు పంపించాలని ఒత్తిడి చేశాడు. వెంటనే అనుమానించిన అతడు పోలీసు కానిస్టేబుల్‌కు ఫోన్ చేసి, విషయం తెలిపాడు. దీంతో అతడు అడ్డాకుల ఎస్ఐ ఎం.శ్రీనివాస్‌కు కాన్ఫరెన్స్ కాల్ కలిపి మాట్లాడించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ తాను డబ్బు పంపించాలని ఎవరికీ ఫోన్ చేయలేదని స్పష్టం చేశారు. ఇలాంటి ఫేక్ కాల్స్‌పై అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు.

అనుమానాస్పద మృతి కేసులో నిందితుడికి రిమాండ్

తాడూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : భూమి విషయమై దాయాదుల మధ్య జరిగిన గొడవలో ఓ వ్యక్తిపై దాడి చేసి, మృతికి కారణమైన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ గురుస్వామి తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా, తాడూరు మండలంలోని ఐతోల్ గ్రామంలో గత ఫిబ్రవరిలో భూమి విషయమై దాయాదుల మధ్య గొడవ జరిగింది. ఆ సమయంలో తిరుపతయ్య అనే వ్యక్తిపై అదే గ్రామానికి చెందిన పర్వతాలు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతడు కొద్ది రోజులు ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి చేరుకున్న అతడు అనుమానాస్పదంగా మృతి చెందాడు. ఘటనకు సంబంధించి మృతుడి భార్య వెంకటమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు. నిందితుడు పర్వతాలును అరెస్ట్ చేసి శనివారం రిమాం డ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

క్రైం కార్నర్

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

» నలుగురికి తీవ్ర గాయాలు

వంగూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. నలుగురు గాయపడ్డారు. నాగర్‌కర్నూల్ జిల్లా, వంగూరు మండలంలోని హైదరాబాద్ - శ్రీశైలం ప్రధాన రహదారిపై ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ద్విచక్రవాహనం ఢీకొనడంతో ఒకరు మృతి చెందారు. ఎస్‌ఐ మహేందర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నల్గొండ జిల్లా, డిండి మండలం, తవక్లాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని నగరదుబ్బ తండాకు చెందిన రామ్‌కోటి (60) శనివారం ద్విచక్ర వాహనంపై కల్వకుర్తికి వస్తున్నాడు. వంగూరు గేటు వద్ద, పెట్రోల్ బంక్ సమీపంలో రోడ్డు పక్కన ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొన్నాడు. ప్రమాదంలో రామ్‌కోటి అక్కడికక్కడే మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యా ప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బైక్‌పై నుంచి కిందపడి యువకుడు..

మానవపాడు (ఆంధ్రజ్యోతి) : రోడ్డుపై వెళ్తున్న వ్యక్తిని తప్పించబోయి బైక్‌పై నుంచి కింద పడి ఓ యవకుడు మృతి చెందిన ఘటన జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా, కొల్లాపూర్ నియోజకవర్గం కొడేరు మండలం మెలరం గ్రామానికి కృష్ణనాయక్ (25) సొంత పనుల నిమిత్తం కర్నూల్ వెళ్లాడు. తిరిగి సాయంత్రం వచ్చే క్రమంలో మానవపాడు స్టేజి వద్ద రోడ్డు దాటుతున్న మానవపాడుకు చెందిన సమ్మద్‌ను ఢీకొని కృష్ణనాయక్ కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో కృష్ణనాయక్ అక్కడికక్కడే మృతి చెందగా, సమ్మద్‌కి గాయాలు కావడంతో కర్నూల్ ఆసుపత్రికి తరలించారు.

లారీ, ద్విచక్రవాహనం ఢీ

కృష్ణ (ఆంధ్రజ్యోతి) : లారీ, ద్విచక్రవాహనం ఢీకొని ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. నారాయణపేట జిల్లా, కృష్ణ మండల పరిధిలోని చేగుంట శివారులో శనివారం ఉదయం జరిగింది. కృష్ణ మండలంలోని తంగడిగి గ్రామానికి చెందిన కుర్వ ఆశప్ప, సకాలి దేవప్ప ద్విచక్రవాహనంపై కర్ణాటక రాష్ట్రం, యాదగిరి జిల్లా, బలిచక్ర గ్రామానికి బయలుదేరారు. చేగుంట గ్రామ శివారులో వారి బైక్‌ను గుర్తు తెలియని లారీ వెనుక నుంచి ఢీకొన్నది. దీంతో ఆశప్ప, దేవప్పలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. క్షతగాత్రులను అంబులెన్స్‌లో కర్ణాటక రాష్ట్రం, రాయచూర్ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ నవీద్ తెలిపారు.

వాకింగ్ చేస్తుండగా బైక్ ఢీకొని..

చారకొండ (ఆంధ్రజ్యోతి) : మార్నింగ్ వాక్ చేస్తున్న ఓ వ్యక్తిని ద్విచక్ర వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల - కోదాడ జాతీయ రహదారిలో భాగంగా మర్రిపల్లి నుంచి చారకొండ వరకు నిర్మిస్తున్న బైపాస్‌రోడ్డులో ఈ సంఘటన జరిగింది. చారగొండ మండలంలోని మర్రిపల్లి గ్రామానికి చెందిన మెర్గు వెంకట్‌రెడ్డి శనివారం తెల్లవారుజామున వాకింగ్ చేస్తుండగా ద్విచక్రవాహనం ఢీకొన్నది. దీంతో అతడి కాళ్లు, తలకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు అతడిని 108 అంబులెన్స్‌లో మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

అలంపూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, అలంపూరు మునిసిపాలిటీ ఇమాంపూరు గ్రామ సమీపంలో శనివారం ఓ వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందాడు. స్థానికులు గమనించి సమాచారం అందించడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని విచారించారు. మృతుడు మహబూబ్‌నగర్‌కు చెందిన రఘుపతి కల్వలగా గుర్తించారు. అతడి వద్ద మహబూబ్‌నగర్ నుంచి జడ్చర్ల, అక్కడి నుంచి అలంపూరు చౌరస్తా వరకు ప్రయాణించిన బస్సు టికెట్లు లభ్యమయ్యాయి. పోస్ట్ మార్టం తర్వాత రఘుపతిది హత్యా లేదా ఆత్మహత్యా అనే విషయం తెలుస్తుందని ఎస్‌ఐ తెలిపారు. కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేపట్టినట్లు చెప్పారు. .

కుక్కల దాడిలో గొర్రె పిల్లల మృతి



కుక్కల దాడిలో మృతి చెందిన గొర్రె పిల్లలు

వడ్డేపల్లి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : కుక్కల దాడిలో 30 గొర్రె పిల్లలు చనిపోయాయి. జోగుళాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండలం వెంకట్రామనగర్‌లో శనివారం ఈ సంఘటన జరిగింది. యజమాని కుర్వ కిష్టన్న తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం ఉదయం గొర్రె పిల్లలను ఇనుప కంచెలో ఉంచి మందను మేతకు తీసుకెళ్లారు. తిరిగి వచ్చే సరికి 30 గొర్రె పిల్లలపై కుక్కలు దాడి చేసి చంపేశాయి. దీంతో దాదాపు రూ. లక్షకుపైగా నష్టం వాటిల్లిందని కిష్టన్న తెలిపారు.

బ్యాంకు ఖాతాలో నుంచి డబ్బు స్వాహా

నాగర్‌కర్నూల్ క్రైం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : ఓ వ్యక్తి బ్యాంకు ఖాతాలో నుంచి రూ. 1.66 లక్షలు మాయం అయ్యాయి. నాగర్‌కర్నూల్ ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ మండలంలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన వాడాల భాస్కర్ మొబైల్ ఫోన్ ఈ నెల 22న పోగొట్టుకుపోయింది. దీంతో అతడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శనివారం డబ్బు డ్రా చేసేందుకు బ్యాంకు వెళ్లాడు. తన ఖాతాలో నుంచి రూ. 1.66 లక్షలు మాయం అయినట్లు గుర్తించాడు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇసుక టిప్పర్లను అడ్డుకున్న రైతులు



రోడ్డుకు అడ్డంగా గోతి తీసి ఇసుక టిప్పర్లను అడ్డుకున్న రైతులు

మిడ్జిల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, మిడ్జిల్ మండలంలోని కొత్తపల్లి గ్రామ శివారు నుంచి ఇసుకను తరలిస్తున్న టిప్పర్లను శనివారం రైతులు తమ పట్టా భూమిలో ఏర్పాటు చేసుకున్న రోడ్డు పైనుంచి వెళ్లనివ్వమని రోడ్డుకు అడ్డంగా గోతి తీసి అడ్డుకున్నారు. ఇసుక తరలింపు ప్రదేశంలో ప్రభుత్వ భూమి, నదినాలా ఉందని అధికారులకు ఫిర్యాదు చేసినా రైతులను పిలు వకుండా నామమాత్రపు సర్వేలు చేపట్టి ఇసుక రవాణా చేసే వారికి మం డల అధికారులు వత్తాసు పలుకుతున్నారని రైతులు ఆరోపించారు. విష యం తెలుసుకున్న బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు వేణుగోపా ల్‌రెడ్డి, జిల్లా నాయకుడు బాలవర్ధన్‌గౌడ్ అక్కడి చేరుకొని రైతులకు మద్ధ తునిచ్చారు. ఎస్‌ఐ శివనాగేశ్వర్‌నాయుడు అక్కడికి చేరుకొని ప్రభుత్వ అ నుమతులతోనే ఇసుక తరలింపు చేపడుతున్నారని, టిప్పర్లను వదిలేయాలని తీసిన గోతిని పూడ్చివేసి టిప్పర్లను అక్కడి నుంచి పంపించేశారు. నక్షబాట లేకున్నా తమ పట్టా భూముల్లోంచి వెళ్లేందుకు తాము రోడ్డును ఏర్పాటు చేసుకున్నామని, ఈ రోడ్డుపై టిప్పర్లను వెళ్లనివ్వమని, ఇది ఇలాగే కొనసాగితే ఆందోళనలు చేపడుతామని రైతులు రైతులు శ్రీనివాస్‌రెడ్డి, పాండు, రాములు, రమేష్, చిన్న వెంకటయ్య, లక్ష్మయ్య, మల్లయ్య, శ్రీశైలం, పి.రాములు, సంధ్య, బాలస్వామి, కమ్మరి స్వర్ణలత, భద్రమ్మ హెచ్చరించారు.





శిక్షణ పొందుతున్న క్రీడాకారులు (ఫైల్)

ఆటకు వేళాయె!

» వచ్చే నెల 1 నుంచి వేసవి క్రీడా శిబిరాలు
» మహబూబ్‌నగర్ జిల్లాలో 30 కేంద్రాలు
» నెల రోజుల పాటు కొనసాగనున్న శిక్షణ
» 8 నుంచి 16 ఏళ్ల బాల, బాలికలకు అవకాశం

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల్లో విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా సద్వినియోగం చేసుకునేలా క్రీడా శాఖ ఏర్పాట్లు చేస్తోంది. ఆసక్తి ఉన్న చిన్నారులకు వివిధ క్రీడాంశాల్లో శిక్షణ ఇచ్చేందుకు సిద్ధమవుతోంది. రాష్ట్ర క్రీడా సాధికార సంస్థ ఆదేశం మేరకు జిల్లా యువజన, క్రీడా శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక క్రీడా శిక్షణా శిబిరాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటోంది. నెల రోజుల పాటు కొనసాగే ఈ శిబిరాలను విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు.

నెల రోజుల పాటు శిక్షణ

జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్న శిక్షణా శిబిరాలు వచ్చే నెల 1 నుంచి 31వ తేదీ వరకు కొనసాగనున్నాయి. వాటిల్లో చిన్నారులు, ఔత్సాహిక క్రీడాకారులకు వివిధ క్రీడాంశాల్లో శిక్షణ ఇవ్వనున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో కోచ్‌ల ఆధ్వర్యంలో శిక్షణ కొనసాగనున్నది. ఒలింపిక్స్ గుర్తింపు ఉన్న క్రీడల్లో మాత్రమే శిక్షణ ఉంటుంది. కబడ్డీ, వాలీబాల్, ఫుట్‌బాల్, అథ్లెటిక్స్, జిమ్నాస్టిక్స్, యోగా, బ్యాడ్మింటన్, హ్యాండ్‌బాల్, క్రికెట్, స్విమ్మింగ్, నెట్‌బాల్, చెస్ ఆర్చరీల్లో శిక్షణ ఇవ్వనున్నారు. పట్టణ ప్రాంతాల్లో 20, గ్రామీణ ప్రాంతాల్లో 10 మొత్తంగా 27 శిబిరాలను ఏర్పాటు చేయనున్నారు. అవసరమైన చోట అదనంగా శిబిరాలు ఏర్పాటు చేసే అవకాశం ఉంది. శిక్షణ కోసం కోచ్‌లను నియమించేందుకు జిల్లా యువజన, క్రీడా శాఖ ఆధ్వర్యంలో చర్యలు చేపట్టింది. జాతీయ స్థాయి, సీనియర్ క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులను స్వీకరించి ఎంపిక చేసింది.

సద్వినియోగం చేసుకోవాలి



జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఈ ఏడాది వేసవి సెలవుల్లో ప్రత్యేక శిక్షణా శిబిరాలను ఏర్పాటు చేస్తున్నాం. సీనియర్ క్రీడాకారులు, నిష్ణాతులైన కోచ్‌ల పర్యవేక్షణలో ఉదయం, సాయంత్రం 8 నుంచి 16 ఏళ్ల బాల, బాలికలకు శిక్షణ ఇవ్వనున్నాం. బాల బాలికలు, యువతీ యువకులు శిక్షణా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి. వివిధ క్రీడాంశాల్లో నైపుణ్యాలను పెంచుకొని ఉన్నత స్థాయికి ఎదగాలి.

-ఎస్. శ్రీనివాస్. డీవైఎస్‌వో

కోచ్‌లు, శిబిరాల వివరాలు

జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్న 10 శిక్షణా శిబిరాలు, కోచ్‌ల వివరాలిలా ఉన్నాయి. నవీన్ - అథ్లెటిక్స్ (మినీస్టేడియం, అల్లీపూర్), శ్రీకాంత్ - అథ్లెటిక్స్ (మహ్మదాబాద్), నరేశ్ కాత్రవత్ - అథ్లెటిక్స్, ఫెన్సింగ్ (దేవినిగుట తండా, జడ్చర్ల), వడెన్న - ఫుట్‌బాల్ (గంగాపూర్), పి.రోజా - హ్యాండ్‌బాల్ (కోడ్గల్), అభిలాష్ - హ్యాండ్‌బాల్ (వస్పుల), శంకర్‌నాయక్ - కబడ్డీ (బాలానగర్), కనకప్ప - ఖోఖో (కోయిల్‌సాగర్), ఎజాజ్ హుస్సేన్ - వాలీబాల్ (మహ్మదాబాద్), రాంచందర్ - వాలీబాల్ (గాజులపేట) శిక్షణా శిబిరాలు నిర్వహిస్తారు.

పట్టణ ప్రాంతాల్లో 20 శిక్షణా శిబిరాలను ఏర్పాటు చేయనున్నారు. మహబూబ్‌నగర్ పట్టణంలోని స్టేడియంలో వివిధ క్రీడాంశాల్లో శిక్షణ ఇవ్వనున్నారు. అథ్లెటిక్స్ - సునీల్‌కుమార్, బాస్కెట్‌బాల్ - ఖలీల్, వాలీబాల్ - పర్వేజ్‌పాషా, ఫుట్‌బాల్ - నికేష్, హ్యాండ్‌బాల్ - అహ్మద్‌హుస్సేన్, విజయ్ కుమార్ - జిమ్నాస్టిక్, అంజద్ - స్విమ్మింగ్, కురుమూర్తి (కబడ్డీ), బి.నర్సింహ-బాక్సింగ్, నెట్‌బాల్ - విక్రమాదిత్యరెడ్డి, జ్ఞానేశ్వర్ - ఆర్చరీ శిక్షణ శిబిరాలను నిర్వహించనున్నారు. సున్నలలింగం - అథ్లెటిక్స్ (క్రిస్టియన్‌పల్లి), పి.అర్పిత - బాస్కెట్‌బాల్ (మహబూబ్‌నగర్), ఆనంద్‌బాబు - చెస్ (మహబూబ్‌నగర్), ఎల్.ప్రణయ్ - హ్యాండ్‌బాల్, ప్రదీప్‌కుమార్ - హ్యాండ్‌బాల్ (మహబూబ్‌నగర్), బాల మణి - యోగా (మహబూబ్‌నగర్), సురేశ్ - యోగా (అర్బన్ హోమ్ - ఎనుగొండ), సాయికుమార్ - యోగా (ఎనుగొండ), మోయిన్ - క్రికెట్ (జడ్చర్లటౌన్) శిక్షణ శిబిరాలు ఉంటాయి.

సాగు భూములకు పట్టాలు ఇవ్వాలి

» సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం



సమావేశంలో అభివాదం తెలియజేస్తున్న నాయకులు

మరికల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : పేదలు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలివ్వాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు, మాజీ ఎంపీ తమ్మినేని వీరభద్రం డిమాండ్ చేశారు. నారాయణపేట జిల్లా, మరికల్ మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారాయణపేట జిల్లాలోని కంసాన్‌పల్లి, లింగంపల్లి, కొల్లంపల్లి, మరికల్, పిడింపల్లి తదితర గ్రామాల్లో 1,855 ఎకరాల ప్రభుత్వ భూమిని పేద రైతులు చాలా ఏళ్లుగా సాగు చేసుకుంటున్నారన్నారు. కానీ ప్రభుత్వం వారికి ఇప్పటివరకు పట్టా పాస్‌బుక్కులు ఇవ్వలేదని, రైతు భరోసా, రైతు బీమా తదితర పథకాలను వర్తింప చేయడం లేదని విమర్శించారు. కౌలుదారీ, భూసంస్కరణలు, ఉపాధి హామీ తదితర చట్టాలను సీపీఎం పోరాటాల ద్వారానే సాధించామన్నారు. దేశ సంపదను బడాబాబులకు ధారాదత్తం చేస్తూ, పేదలు, రైతులు, సామాన్యులకు తీరని ద్రోహం తలపెడుతున్న భారతదేశ పాలకవర్గంపై పోరాటమే శరణ్యమన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ మాట్లాడుతూ రాష్ట్రంలో .కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను చిత్తశుద్ధితో అమలు చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన వారందరికీ రేషన్‌కార్డులు, ఇదిరమ్మ ఇళ్లు, సాగు భూములకు పట్టాలు, పెన్షన్లు అందేలా పార్టీ ఆధ్వర్యంలో పోరాడుతున్నట్లు తెలిపారు. నారాయణపేట, కొడంగల్ ఎత్తిపోతల పథకాల నిర్వాసితులకు న్యాయమైన పరిహారం అందించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గోపాల్, వెంకట్రాములు,, నాగయ్య, సాగర్, వెంకట్రామారెడ్డి, బాల్‌రామ్, అంజిలయ్య, గౌడ్, బాలప్ప పాల్గొన్నారు.

పేట మార్కెట్లో నిలిచిన క్రయవిక్రయాలు

» 15 లారీల్లో 5 వేల బస్తాల ధాన్యం తరలింపు
» మరో వెయ్యి బస్తాల నిల్వకు అనుమతి



పేట మార్కెట్ యార్డులో లారీల్లో ధాన్యం బస్తాల లోడింగ్

నారాయణపేట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట వ్యవసాయ మార్కెట్ యార్డులో ధాన్యం నిండి పోవడంతో శనివారం అధికారులు టెండర్లు నిర్వహించలేదు. దీంతో ధాన్యం క్రయవిక్రయాలు నిలిచిపోయాయి. యార్డులో నిల్వ ఉన్న 15 వేల బస్తాలను లారీల్లో తరలించేందుకు మార్కెట్ ఛైర్మెన్ శివారెడ్డి, కార్యదర్శి భారతి, సూపర్‌వైజర్ లక్ష్మణ్ చర్యలు తీసుకున్నారు.

మొత్తం 15 లారీ ల్లో ఐదువేల బస్తాలను తరలించారు. మరో 10 వేల బస్తాలు యారులో నిల్వ ఉన్నాయి. వాటిని ఆదివారం తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అయితే శనివారం క్రయవి క్రయాలు జరగబోవని ముందే ప్రకటించినా, పరిసర గ్రామాల నుంచి రైతులు దాదాపు వెయ్యి బస్తాల ధాన్యాన్ని మార్కెట్‌కు తీసుకొ చ్చారు. వాటిని యార్డులోనే నిల్వ చేసుకునేం దుకు అధికారులు అనుమతించడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. సోమవారం మళ్లీ యథావిధిగా టెండర్ల ప్రక్రియ, క్రయ విక్రయాలు జరుగనున్నాయి.

పార్థీ గ్యాంగ్‌లో కీలక వ్యక్తి అరెస్టు

» వివిధ రాష్ట్రాల్లో 50కి పైగా నేరాలు
» 25.9 తులాల బంగారం రికవరీ
» వెల్లడించిన మహబూబ్‌నగర్ ఎస్పీ జానకి



నిందితుడిని, రికవరీ చేసిన బంగారాన్ని విలేకరులకు చూపుతున్న ఎస్పీ డి.జానకి

మహబూబ్‌నగర్/ పాలమూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : దొంగతనాల్లో ఆరితేరిన పార్థీ గ్యాంగ్‌లోని ఓ కీలక వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. పరారీలో ఉన్న మరికొందరి కోసం గాలిస్తున్నారు. కేసు వివరాలను మహబూబ్‌నగర్ జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ జానకి వెల్లడించారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ రూరల్ పరిధిలో తాళాలు వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని రాత్రి వేళ 13 దొంగతనాలకు పాల్పడిన మహారాష్ట్ర జిల్లా, షోలాపూర్ నార్కెడ్‌కు చెందిన అమూల్ రాందాస్ పవార్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి నుంచి 25.9 తులాల బంగారు నగలను రికవరీ చేశారు. చిన్నతనం నుంచే జల్సాలకు అలవాటు పడిన అమూల్ రాందాసు 25 ఏండ్లుగా దొంగతనాలు చేస్తున్నాడు. ఇతడిపై దేశంలో పలు రాష్ట్రాల్లో 50 నుంచి వంద వరకు నేరాలు ఉన్నాయి. కొన్ని చోట్ల వారెంట్లు ఉండగా, పలుమార్లు జైలుకు వెళ్లి వచ్చాడు. జైలు నుంచి విడుదలైన తరువాత మహీంద్ర కారుతో పాటు, ఐ20 కారు కొనుగోలు చేశాడు. స్నేహితులు సచిన్, ఆకాష్‌బట్, ఆకాష్‌లతో కలిపి పలు రాష్ట్రాల్లో దొంగతనాలు చేశాడు. సినీ ఫక్కీలో కారు నెంబరు కనిపించకుండా స్టిక్కర్లు వేసి చోరీలకు పాల్పడతాడు. బండమీది పల్లికి చెందిన బండారి లింగం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు అతడిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో దొంగిలించిన బంగారాన్ని శనివారం జడ్చర్ల ప్రాంతంలో విక్రయించేందుకు యత్నిస్తుండగా పోలీసులు పట్టుకొని అరెస్ట్ చేశారు. అతడి నుంచి బంగారంతో పాటు, ఇళ్ల తాళాలు పగులగొట్టే కట్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించిన పోలీసు అధికారులకు ఎస్పీ రివార్డులు అందించారు. విచారణలో ప్రతిభ కనబరిచిన డీఎస్పీ వెంకటేశ్వర్లు, రూరల్ సీఐ గాంధీనాయక్, జడ్చర్ల రూరల్ సీఐ నాగార్జునగౌడ్, సీసీ ఎస్ సీఐ నాగరాజు, రూరల్ ఎస్‌ఐ విజయ్ కుమార్, నవాబ్‌పేట ఎస్‌ఐ విక్రమ్, రూరల్ ఎస్‌ఐ-2 చంద్రమోహన్, కానిస్టేబుళ్లు లింగ్యానాయక్, రఘు, మహేందర్, శ్రీనివాస్, వెంకటేశ్, బాలచంద్రుడు, రఘు, గోపాల్, టెక్నికల్ సీఐ రియాజ్ అహ్మద్, ప్రవీణ్, రవి, శ్రీనివాస్, నిరంజన్‌లను ఎస్పీ అభినందించారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ రాములు పాల్గొన్నారు.

'నేతన్నకు చేయూత' మగ్గాల పరిశీలన

- ఉన్నతాధికారులకు నివేదిక - ఏడీవో మహ్మద్ షాకీర్



నేతన్నకు చేయూత దరఖాస్తుదారు మగ్గాన్ని పరిశీలిస్తున్న హైదరాబాద్ ఏడీవో మహ్మద్ షాకీర్

రాజోలి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : నేతన్నకు చేయూత (త్రిఫ్ట్ ఫండ్) పథకానికి దరఖాస్తు చేసుకున్న కార్మికుల మగ్గాలను శనివారం జోగుళాంబ గద్వాల ఏడీవో ఉపేంద్ర, హైదరాబాద్ నుంచి వచ్చిన ఏడీవో మహ్మద్ షాకీర్ పరిశీలించారు. తెలంగాణ ప్రభుత్వం చేనేత కార్మికులకు అందిస్తున్న నేతన్నకు చేయూత పథకం (తిఫ్ట్ ఫండ్) ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రారంభించింది. అందుకు సంబంధించి లబ్ధిదారుల మగ్గాలను పరిశీలించి, మార్చిలో అర్హులను గుర్తించారు. ఆ సమయంలో మగ్గం వార్పు పూర్తయి, రన్నింగ్‌లో లేని మగ్గాలను తిరస్కరించారు. కార్మికులు మగ్గాలను పునరుద్ధరించుకొని మళ్లీ దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా శనివారం రాజోలికి వచ్చిన అధికారులు దరఖాస్తుదారుల మగ్గాలను పరిశీలించారు. మొత్తం 70 మగ్గాలను పరిశీలించామని, ఈ మేరకు ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఏడీవో మహ్మద్ షాకీర్ తెలిపారు. కార్యక్రమంలో ఏడీవో ఉపేంద్ర, రాజోలి చేనేత సహకార సంఘం ఇన్‌చార్జి అధ్యక్షులు దోత్రె శ్రీనివాసులు, కార్మికులు పాల్గొన్నారు.

అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్న కారు

మూసాపేట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, మూసాపేట మండలంలోని జాతీయ రహదారిపై ఓ కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొన్నది. శనివారం జరిగిన ఈ సంఘటనపై స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, నందికొట్కూరుకు చెందిన మాధవ్ తన కుమారుడితో కలిసి మహబూబ్‌నగర్‌కు వెళ్తున్నాడు. జానంపేట గ్రామ సమీపంలోని ఆసుపత్రిని దాటిన తర్వాత అకస్మాత్తుగా కారు అదుపు తప్పి రోడ్డు మధ్యలోనున్న డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో మాధవ్‌కు స్వల్ప గాయాలు కాగా, కారు దెబ్బతిన్నది. గమనించిన స్థానికులు వారికి సహాయక చర్యలు అందించారు.

న్యూస్ బాక్స్

శ్రీరామకొండలో పకడ్బందీ బందోబస్తు

కోయిలకొండ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన శ్రీరామ కొండలో ఆదివారం అమావాస్యకు పకడ్బందీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు. శనివారం శ్రీరామ కొండలో ఏర్పాట్లను పరిశీలించారు. కొండపైకి వాహనాలు వెళ్లేందుకు అనుమతి ఇవ్వమని, కింది నుంచి పై వరకు పోలీస్ బందోస్తును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో కొండపై తాగునీరు సైతం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేయనున్నట్లు తెలిపారు.

నేడు రాష్ట్ర నెట్‌బాల్ జట్ల ఎంపికలు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయి నెట్‌బాల్ టోర్నీలో పాల్గొనే బాల, బాలికల, మహిళ, పురుషుల జట్ల ఎంపికలను ఆదివారం నగరంలోని ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా నెట్‌బాల్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు విక్రమాదిత్యరెడ్డి, ఖాజాఖాన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు సంబంధిత ధ్రువపత్రాలతో స్టేడియంలో రిపోర్టు చేయాలని కోరారు.

కొనసాగిన ధాన్యం కొనుగోళ్లు

దేవరకద్ర, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : దేవరకద్ర వ్యవసాయ మార్కెట్‌కు శనివారం ఆర్ఎన్ఆర్ 685 క్వింటాళ్లు విక్రయానికి రాగా, క్వింటాలుకు గరిష్ఠంగా రూ.2236, కనిష్ఠంగా రూ.1809 పలికినట్లు మార్కెట్ కార్యదర్శి జయశ్రీ తెలిపారు. ఆముదాలు 8 క్వింటాళ్లు రాగా, గరిష్ఠంగా రూ.6010, కనిష్ఠంగా రూ.6000, పెద్ద హంస 65 క్వింటాళ్లు రాగా, క్వింటాలుకు గరిష్ఠంగా రూ.1749, కనిష్ఠంగా రూ.1629 పలికింది.

క్రీడలతో మానసికోల్లాసం



క్రికెట్‌ను ప్రారంభిస్తున్న ఖాజా మైనోద్దీన్

మూసాపేట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : క్రీడలతో మానసికోల్లాసం కలుగుతోందని అడ్డాకుల కాంగ్రెస్ నాయకుడు ఖాజామైనోద్దిన్ అన్నారు. శనివారం అడ్డాకుల మండల కేంద్రంలో నిర్వహించిన ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను ఎంపీటీసీ మాజీ సభ్యుడు భీమన్నయాదవ్‌తో కలిసి ప్రారంభించారు. యువత గెలుపోటములు సమానంగా స్వీకరించాలన్నారు. మొత్తం 10 టీంలు పాల్గొనగా, క్రీడాకారులకు టీ షర్టులను దాత ఖాజామైనోద్దిన్ అందజేశారు. శ్రీనివాసులు, నిరంజన్‌గోరి, మురారి, సుదర్శన్, బాలరాజు, ప్రసాద్ పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

మిడ్జిల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో ధాన్యం కొనుగోలు విషయంలో రైతు లకు ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలని బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ చైర్మన్ తంగెళ్ల జ్యోతి అల్వాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బరిగెల శారద వెంకటయ్య శనివారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. అధికారులు రైతుల ధాన్యాన్ని రైతు వేదికలు, సొసైటీల వద్దకు తీసుకొని వస్తే హమాలీ చార్జీలు ఎక్కువై రైతులకు భారంగా మారుతుంది. దీంతో సన్న చిన్న కారు రైతులకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదముందన్నారు. వడ్ల కొనుగోలు విషయంలో గతంలో అనుసరించిన విధివిధానాలను ప్రస్తుత సీజన్‌లో కొనసాగించాలని తెలిపారు.

రాజ్యాంగ హక్కులు కాపాడుదాం



పాదయాత్రలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

నవాబ్‌పేట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ హక్కులను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని మార్కెట్ కమిటీ చైర్మన్ హరలింగం, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాంచంద్రయ్య అన్నారు. శనివారం మండలంలోని కాకర్లాలలో జైబాపు, జై భీం, జైసంవిధాన్ పాదయాత్ర చేపట్టి, మాట్లాడారు. నాయకులు వాసుయాదవ్, నవాజ్‌రెడ్డి, హమీద్ మహేక్, వెంకటేష్‌గౌడ్, భూపాల్‌రెడ్డి, ఖాజ, రవీందర్‌రెడ్డి, రాజశేఖర్, నీల్యానాయక్, మైనోద్దిన్, సంతోష్‌నాయక్, ఉమ్మర్, శ్రీనివాస్, షబ్బీర్, రాములు, కృష్ణయ్య, శ్రీహరి, నర్సింహులు, నీలకంఠం పాల్గొన్నారు.

శ్రీనివాస రామానుజన్‌కు ఘన నివాళి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : ప్రఖ్యాత గణిత శాస్త్రవేత్త శ్రీనివాసరామానుజన్ వర్ధంతి సందర్భంగా శనివారం జిల్లా కేంద్రంలోని ఉపాధ్యాయ విద్యా కళాశాలలో రామానుజన్ చిత్రపటానికి అధ్యాపకులు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు గణిత శాస్త్రవేత్త రామానుజన్ గణితంలో సమూల మార్పులు తీసుకొచ్చారన్నారు. కార్యక్రమంలో కళాశాల సూపరింటెండెంట్ రామకృష్ణరావు, అధ్యాపకులు శ్రీకాంత్, జనార్ధన్‌రెడ్డి, శైలజ, ఫరీదాబేగం, రియాజుద్దిన్, రాజప్ప పాల్గొన్నారు.



నిరసన ర్యాలీలో మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఎస్పీ వెంకటేశ్



తెలంగాణ చౌరస్తా వద్ద నివాళి అర్పిస్తున్న ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్

ఉగ్రదాడిని ఖండిస్తూ నిరసన



ర్యాలీ నిర్వహిస్తున్న యుటీఎఫ్ నాయకులు

మహబూబ్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : కశ్మీర్ రాష్ట్రంలోని పహల్గాంలో ఉగ్రమూకల దాడిని ఖండిస్తూ శనివారం జిల్లా ఒలింపిక్ సంఘం, క్రీడా సంఘాల ఆధ్వర్యంలో స్టేడియం మైదానం నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు నిరసన ర్యాలీ నిర్వహించి, అమరులకు నివాళి అర్పించారు. ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఎస్పీ వెంకటేశ్ మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

● మహబూబ్‌నగర్ టౌన్ : మానవత్వాన్ని మరిచిపోతున్న మతోన్మాదం రంగు పులుముకొని మారణ కాండకు పాల్పడుతోందని ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ ఫోరం అధ్యక్షుడు రాసింహుడు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం తెలంగాణ చౌరస్తాలో ఉగ్రదాడిలో మృతి చెందిన వారికి నివాళి అర్పించారు. అంతకుముందు జిల్లా పరిషత్ మైదానం నుంచి తెలంగాణ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు.

● జడ్చర్ల : పర్యాటకులను కాల్చి చంపిన ఉగ్రవాదులను శిక్షించాలని బాదేపల్లి మార్కెట్‌లోని వ్యాపారస్తులు, హమాలీలు, దడవాయిలు శనివారం మార్కెట్ నుంచి నేతాజీచౌరస్తా, సిగ్నల్‌గడ్డ మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ నర్సింగ్‌రావుకు వినతిపత్రం అందచేశారు.

● పాలమూరు : టెర్రరిస్టు పాకిస్తాన్ దుశ్చర్యలు నశించాలని, అమాయక ప్రజలపై ఉగ్రవాదులను ఉసిగొల్పే కుట్రలు మానుకోవాలని రిటైర్డ్ పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు పటేల్ సత్తయ్య హెచ్చరించారు. శనివారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో పహల్గాం మృతులకు రిటైర్డ్ పోలీసు అధికారుల సంఘం ఆధ్వర్యంలో కొవ్వొత్తులు వెలిగించి, మౌనం పాటించి నివాళి అర్పించారు. రాఘవరెడ్డి, కృష్ణుడు, శేఖర్, మోహన్‌రెడ్డి, రహీం, వహీద్, ఇక్బాల్, రాములు, అనంతరెడ్డి, రంగినేని మన్మోహన్ పాల్గొన్నారు. అదే విధంగా సీపీఐ ఆధ్వర్యంలో జిల్లా కార్యదర్శి బాలకిషన్ మాట్లాడుతూ ఉగ్రదాడిలో మరణించిన, గాయపడిన పౌరులకు నష్టపరిహారం అందజేయాలన్నారు. బీసీ మహాసభ జిల్లా అధ్యక్షుడు మెట్టుకాడి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో పహల్గాం మృతులకు నివాళి అర్పించారు.

● మహబూబ్‌నగర్ విద్యావిభాగం : టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర నాయకుడు కిష్టయ్య, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రవికుమార్, వెంకటేష్ ఆధ్వర్యంలో న్యూటౌన్ నుంచి ఆర్అండ్‌బీ గెస్టు హౌజ్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఉమాదేవి, నర్సింహులు, భాస్కర్, మన్యం, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాను అరికట్టాలి

» జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.పాపిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.పాపిరెడ్డి

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : మానవ అక్రమ రవాణా, వెట్టి చాకిరి నిర్మూలనకు అన్ని శాఖలు పరస్పర సహకారం, సమన్వయంతో పనిచేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.పాపిరెడ్డి అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మానవ అక్రమ రవాణా, వెట్టి చాకిరి నిర్మూలనపై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ విజయేందిర బోయి, ఎస్పీ జానకితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి సమావేశాన్ని ప్రారంభించి, మాట్లాడారు. మహబూబ్‌నగర్ జిల్లాను మానవ అక్రమ రవాణా, వెట్టిచాకిరి రహిత జిల్లాగా రూపొందించాలన్నారు. చిన్న పిల్లలు, మహిళల మానవ అక్రమ రవాణా గుర్తించి, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమస్య వస్తే చట్ట పరంగా తీసుకోవల్సిన చర్యలు, సందేహాలను నివృత్తి చేసుకోవాలన్నారు. ముంబై, ఢిల్లీ, ఇతర రాష్టాలతో పోల్చుకుంటే మహబూబ్‌నగర్ జిల్లాలో చాలా తక్కువగా ఉన్నట్లు తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ మానవులను ఒక ఆట వస్తువుగా లైంగిక హింసకు గురిచేయడం, పని మనుషులుగా పనిచేయడం కోసం తదితర కారణాలతో ఇతర రాష్ట్రాలు, దేశాలకు రవాణా చేయడం జరుగుతుందని దాన్ని అరికట్టాలన్నారు. ఎస్పీ జానకి మాట్లాడుతూ అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తేనే అనుకున్నది సాధిస్తామన్నారు. అక్రమ రవాణా ముఖ్యంగా టీనేజ్ అమ్మాయిల్లో ఎక్కువ శాతం జరుగుతుందన్నారు. వీరిని ట్రేస్ చేయడం సులభం కాదని, చైల్డ్ మ్యారేజీలను నివారించాలని కోరారు. న్యాయసేవాధికారం సంస్థ కార్యదర్శి ఇందిర మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులకు తమవంతుగా సహకారం అందిస్తామన్నారు. డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ చంద్రశేఖర్‌గౌడ్, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిణి జరీనా బేగం, డీఎంహెచ్‌వో కృష్ణ, ఇంటర్‌నేషనల్ జస్టిస్ మిషన్ జోబి ఏసుదాస్ పాల్గొన్నారు.

వచ్చే నెల 4న నీట్ పరీక్ష

» జిల్లాలో 13 పరీక్ష కేంద్రాలు, 4,454 మంది అభ్యర్థులు

» సమీక్షా సమావేశంలో కలెక్టర్ విజయేందిర బోయి



మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ద్వారా మే 4న నీట్ పరీక్ష నిర్వహించనున్నట్లు కలెక్టర్ విజయేందిర బోయి తెలిపారు. ఈ సందర్భంగా పరీక్షా కేంద్రాల వద్ద పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎంవీఎస్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్, పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయం, ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజ్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజ్, ఎన్టీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, పాలమూరు యూనివర్సిటీ పీజీ కళాశాల అండ్ సైన్స్ బ్లాక్, డాక్టర్ బీఆర్ ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, తెలంగాణ మైనార్టీస్ రెసిడెన్షియల్ స్కూల్, ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల, ప్రభుత్వ మోడల్ బేసిక్ హైస్కూల్, ఎంజేపీటీబీసీడబ్ల్యూ రెసిడెన్షియల్ స్కూల్ (బాలికల), టీజీఎస్‌డబ్ల్యూ రెసిడెన్షియల్ స్కూల్, గర్ల్స్ జూనియర్ కళాశాలలో ఈ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొత్తం 4,454 మంది అభ్యర్థులు హాజరుకానుండగా, ఉదయం 11.30 గంటల నుంచి పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తారని తెలిపారు. అభ్యర్థుల హాల్ టికెట్, ఫొటో గుర్తింపును క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. అభ్యర్థుల అడ్మిట్ కార్డులతో పాటు రెండు పాస్ ఫొటో సైజ్ ఫొటోలు, ఒక కార్డు సైజ్ ఫొటో తీసుకరావాలన్నారు. పరీక్ష ఓఎంఆర్ షీట్ విధానంలో ఉంటుందని, అన్ని పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమరాలు ఏర్పాటు చేయాలన్నారు. శాంతి భద్రతల నిర్వహణకు బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్ శాఖను ఆదేశించారు. పరీక్ష కేంద్రాలకు చేరుకొనేలా బస్సులను సకాలంలో ఏర్పాటు చేయాలని ఆ శాఖ అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఎస్పీ జానకి, అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ సురేందర్, కేజీబీవీ అకాడమిక్ మానిటరింగ్ అధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు ఏం కోల్పోయారో అర్థమైంది

» మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సి.లక్ష్మారెడ్డి » రజతోత్సవం సందర్భంగా బీఆర్ఎస్ జెండా ఆవిష్కరణ



జడ్చర్లలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి డాక్టర్ సి.లక్ష్మారెడ్డి



రాజాపూర్‌లో..

జడ్చర్ల, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ప్రజలు ఏం కోల్పోయారో వారికి అర్థమైందని, గతంలో ఎన్నడూ లేని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యతిరేకతను ఎదుర్కొంటుందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మారెడ్డి అన్నారు. ఒక రోజు ముందుగానే పార్టీ ఆవిర్భావ దినోత్సవ సంబురాలను ఆదివారం జడ్చర్లలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో పార్టీ జెండాను ఆవిష్కరించారు.

● నవాబ్‌పేట : మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు పార్టీ జెండాలను ఆవిష్కరించారు. మాజీ ఎంపీపీ నర్సిములు, శ్రీనివాస్, మాజీ సర్పంచులు గోపాల్‌గౌడ్, యాదయ్య, నాయకులు తిరుపతయ్య, రవి, వెంకటేష్, గోపాల్, చెన్నయ్య, పాల్గొన్నారు.

● మిడ్జిల్ : కాంగ్రెస్ పాలనతో ప్రజలు విసుగుచెందారని, రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ సుదర్శన్ అన్నారు. బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాల్లో బీఆర్ఎస్ జెండాను ఎగురవేశారు. వరంగల్‌లో నిర్వహించే రజతోత్సవానికి తరలిరావాలని కోరారు.

● రాజాపూర్: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు పార్టీ జెండా ఆవిష్కరిచారు. మండల అధ్యక్షుడు శ్రీశైలం యాదవ్, మాజీ ఎంపీపీ నర్సింహులు, తిరుపతయ్య, యాదగిరి, కృష్ణయ్య, రాములు, దస్తగిరి, యాదయ్య పాల్గొన్నారు.

● కోయిలకొండ : వరంగల్‌లో నిర్వహించే బీఆర్ఎస్ సభకు కోయిలకొండ నుంచి మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తలు భారీగా తరలివెళ్తున్నట్లు మండల అధ్యక్షుడు బీక్షపతయ్య తెలిపారు. శనివారం మండల కేంద్రంలో సభ పోస్టర్లను విడుదల చేసి, మాట్లాడారు. జడ్పీటీసీ మాజీ సభ్యుడు విజయభాస్కర్‌రెడ్డి, నాయకులు సయ్యద్‌శమీం, భీంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాజవర్ధన్‌రెడ్డి, ఖాజ, నారాయణగౌడ్, నాగేష్, లక్కిగౌడ్, నజీమ్, ఆంజనేయులు, భీమయ్య పాల్గొన్నారు.

● మూసాపేట : ఆదివారం వరంగల్‌లో తలపెట్టిన బీఆర్ఎస్ రజోత్సవ సభకు కార్యకర్తలు తరలిరావాలని జడ్పీటీసీ మాజీ సభ్యుడు ఇంద్రయ్యసాగర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లక్ష్మీనర్సింహాయాదవ్ కోరారు. ఉదయం 8 గంటలకు జెండాను ఆవిష్కరించి, వరంగల్ సభకు బయలుదేరాలని సూచించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి : ఎస్పీ

మహబూబ్‌నగర్ న్యూటౌన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరగాళ్లపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ జానకి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సైబర్ నేరానికి గురైతే 1930కి కాల్ చేయాలన్నారు. లేదా సైబర్ క్రైమ్ వెబ్‌సైట్‌ను సంప్రదించాని సూచించారు. బాధితులు (గోల్డెన్ హవర్‌లో) మోసపోయినట్టు వెంటనే గుర్తించి ఫిర్యాదు చేస్తే సైబర్ క్రైం బారిన పడిన వారికి న్యాయం చేకూర్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. వాట్సాప్ వీడియో కాల్ చేస్తూ డిజిటల్ అరెస్ట్ పేరుతో మోసం చేస్తున్నారని, గుర్తింపు లేని వెబ్‌సైట్స్‌లో వెతకడం, ఓపెన్ చేయడం, ఏపీకే ఫైల్స్ డౌన్‌లోడ్ చేసుకోవడం వల్ల ఫోన్ హ్యాక్ అవుతుందన్నారు. బెట్టింగ్ యాప్‌లకు యువత దూరంగా ఉండాలన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో వారం రోజుల్లో 29 సైబర్ నేరాలు నమోదు కాగా, 20 కేసులు ఆర్థిక నేరాలు, 9 కేసులు ఆర్థికేతర నేరాలు నమోదైనట్లు వివరించారు. వాటిలో కొన్ని ఎస్పీ వివరించారు. మహబూబ్‌నగర్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో అజ్ఞాత వ్యక్తి కాల్ చేసి ఇండియాబుల్స్ లోన్ ఎగ్జిక్యూటివ్‌గా పరిచయం చేసుకుని రుణ ఆమోదానికి ఫీజు పేరుతో బాధితుడి నుంచి రూ.1,60,654 డబ్బులు వసూలు చేశాడని తెలిపారు. వన్‌టౌన్ పరిధిలో బాధితురాలు ఫేస్‌బుక్‌లో స్క్రోల్ చేసిన వెంటనే వాట్సాప్ ద్వారా దొంగలు సంప్రదించి మొదట కొన్ని లాభాలు చూపించి, తర్వాత ఎక్కువ పెట్టుబడికి వత్తిడి చేశారని తెలిపారు. ఈ ఘటనలో బాధితురాలు రూ.47 వేలు మోసపోయిందన్నారు. బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో వ్యాపార పెట్టుబడుల పేరుతో రూ.1,72,986 మోసపోయినట్లు వివరించారు. మహబూబ్‌నగర్ టూటౌన్ పరిధిలో ఇండియా హిల్ హౌస్ కాంపిటీషన్ పేరుతో రూ.15.5 లక్షలు మోసపోయాడని తెలిపారు. వారు మరో రూ.42 లక్షలు డిమాండ్ చేయడంతో బాధితుడు సైబర్ క్రైమ్‌ను ఆశ్రయించినట్లు తెలిపారు.

గన్నీ బ్యాగుల కొరత లేకుండా చూడాలి

దేవరకద్ర, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు గన్నీ బ్యాగుల కొరత లేకుండా చూడాలని తహసీల్దార్ కృష్ణయ్య అన్నారు. శనివారం మండలంలోని నాగారంలో సింగిల్ విండో వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేసి, రైతులతో మాట్లాడారు. గన్నీ బ్యాగుల కొరతతో రెండు రోజుల నుంచి ధాన్యం కొనుగోలు జరగడం లేదని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన వెంటనే రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. రైతులు ధాన్యం కంటా అయ్యేవరకు మాత్రమే మీ బాధ్యత అని, తర్వాత కొనుగోలు సెంటర్లదే బాధ్యత అన్నారు.

లో వోల్టేజీ నివారణకే సబ్‌స్టేషన్లు



సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ న్యూటౌన్/ పాలమూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : నిరంతరం విద్యుత్‌ను సరఫరా చేసేందుకే సబ్‌స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం తెలంగాణ రాష్ట్ర దక్షిణ మండల విద్యుత్ పంపిణీ సంస్థ ఆధ్వర్యంలో నిర్మించే సబ్ స్టేషన్‌కు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తి అయితే తిరుమల హిల్స్ చుట్టు పక్కల ఉన్న మెడికల్ కళాశాల, మయూరి పార్క్ చుట్టు పక్కల ఉన్న గ్రామాలకు కరెంటు కోతలు లేకుండా విద్యుత్ సరఫరా చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ముడా లక్ష్మణ్‌యాదవ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనితరెడ్డి, విద్యుత్ శాఖ ఎస్ఈ రమేష్, డీఈ లక్ష్మణ్, ఏఈ నర్సిరెడ్డి, ఏడీ మద్దిలేటి పాల్గొన్నారు.

భయం వీడి పరీక్ష రాయాలి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం : విద్యార్థులు భయం వీడి పరీక్షలు రాస్తే మంచి ఫలితాలు వస్తాయని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివిస్‌రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని జయప్రకాశ్ నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో ఎడ్‌సెట్ మాక్ పరీక్ష నిర్వహించగా, ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. మాక్ పరీక్ష రాయడంతో విద్యార్థుల్లో ఉన్న భయం తొలగి ఫైనల్ పరీక్ష బాగా రాస్తారన్నారు. జేపీఎన్‌సీఈ చైర్మన్ కేఎస్ రవికుమార్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహరెడ్డి, నిర్వాహకులు సీహెచ్ వెంకటేష్, సంపల్ పటేల్ పాల్గొన్నారు.

ఘనంగా చండీహోమం



చండీహోమం నిర్వహిస్తున్న భక్తులు

జడ్చర్ల, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల పట్టణంలోని సంతోషిమాత ఆలయంలో శనివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా చండీ హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా 13 హోమ గుండాలలో 52 మంది దంపతులు చండీ హోమంలో పాల్గొన్నారు. అమ్మవారిని లక్ష్మీదేవి, సరస్వతిదేవిగా అలంకరించారు. జడ్చర్ల మునిసిపల్ చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత, బాదేపల్లి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జ్యోతి అల్వాల్‌రెడ్డి, కౌన్సిలర్ ప్రశాంత్‌రెడ్డి, ఎంఈవో మంజులాదేవీ జగదీశ్వర్‌రెడ్డి దంపతులు చండీహోమంలో పాల్గొన్నారు. ప్రముఖ నాయకుడు బొగ్గారపు దయానంద్ పాల్గొని ప్రతీ ఒక్కరిలో భక్తిభావం పెరగాలని ఆకాంక్షించారు. మునిసిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షురాలు గుబ్బ సుజాత, గుబ్బ శ్రీను, గోనెల రాధాకృష్ణ, అశోక్‌రావు, సురేందర్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'దట్ బాయ్ తాతా' నవల ఆవిష్కరణ



చేతన్ భగత్ చేతుల మీదుగా దట్ బాయ్ తాత నవల ఆవిష్కనణ

మహబూబ్‌నగర్ న్యూటౌన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : నేటి యువతరం ఎదుర్కొంటున్న సమస్యలపై తెలంగాణకు చెందిన సన్నీ కోటాల రాసిన తొలి నవల (దట్ బాయ్ తాతా) శనివారం ముంబాయి నగరంలో ప్రముఖ నవల రచయిత చేతుల మీదుగా ఆవిష్కరించారు. సన్నీ రాసిన దట్ బాయ్ తాతా నవల నేటి యువత ఎదుర్కొంటున్న సమస్యలను హైలెట్ చేస్తుందని చేతన్ భగత్ అన్నారు. యువత పక్కదారులు పడితే వచ్చే పర్యవసానాలు ఈ రచనలో చక్కగా వివరించబడ్డాయని తెలిపారు. యువత తమ లక్ష్యాలను సాధించడంలో వారి బలహీనతలను అధిగమించడంలో ఈ నవల ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. నవల రచయిత (సన్నీ కోటాల) ఎంబీఏ పూర్తి చేసిన తర్వాత ఐసీఎఫ్ఏఐ నుంచి పీహెచ్‌డీ చేస్తున్నట్లు తెలిపారు. నవల రచయిత తండ్రి ప్రముఖ విద్యాసంస్థలైన జయప్రకాష్ నారాయణ్ ఇంజనీరింగ్ కళాశాలల చైర్మన్ కెఎస్ రవికుమార్ ఈ సందర్భంగా తన ఆనందాన్ని పంచుకుంటు సన్నీ చిన్నతనం నుంచే ఇంగ్లిష్ నవలలు చదవడానికి ఆసక్తి చూపే వారన్నారు. అతడు రచించన తొలినవలను జాతీయ స్థాయిలో పేరుగాంచిన ప్రముఖ నవల రచయిత చేతుల మీదుగా ఆవిష్కరణ జరగడం ఎంతో సంతోషాన్ని కలిగించిందన్నారు.

వివేకానంద డిగ్రీ కళాశాలలో క్యాంపస్ సెలక్షన్స్



క్యాంపస్ సెలక్షన్స్‌లో పాల్గొన్న ప్రతినిధులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : హెటిరో బయోఫార్మా ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని స్వామి వివేకనంద డిగ్రీ, పీజీ కళాశాలలో శనివారం క్యాంపస్ సెలక్షన్స్ నిర్వహించారు. ఈ క్యాంపస్ సెలక్షన్స్‌కు 420 మంది విద్యార్థులు హాజరు కాగా, వీరిలో 74 మందిని ఎంపిక చేశారు. వారికి హెటిరో సంస్థ ప్రతినిధులు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కుమారస్వామి మాట్లాడుతూ స్వామి వివేకపంద కళాశాల విద్యతో పాటు తగిన ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో ఎప్పుడూ ముందుంటుందన్నారు. కళాశాల కరస్పాండెంట్ కే.ఫణిప్రసాద్‌రావు, డైరెక్టర్ సయ్యద్ ఇబ్రహీం కలీల్ విద్యార్థులను అభినందించారు. హెటిరో సంస్థ ప్రతినిధులు ప్రవీణ్ కుమార్, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.